క్లుప్తంగా

గోరింటాకు పండుగ



కల్వకుర్తి: ఆషాడ మాసం పురస్కరించుకొని గోరింటాకు పండుగను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత జాగృతి సమితి జిల్లా అధ్యక్షురాలు మిరియాల పావని ఆధ్వర్యంలో మహిళలు మెహంది పెట్టుకున్నారు. ఈ మాసంలో గోరింటాకును పెట్టుకోవడం వల్ల మంచి జరుగుతుందని మహిళల నమ్మకం. కార్యక్రమంలో విజయలక్ష్మి, మాధురి, సునిత, శోభ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని కుందారంతండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శేషన్‌నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5000 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సింగిల్‌విండో డైరెక్టర్లు సంజీవ్‌కుమార్‌యాదవ్, శేఖర్‌ముదిరాజ్, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనునాయక్, రాజశేఖర్, నర్సింహ్మ తదితరులు ఉన్నారు.

లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా యాదయ్య



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఎన్నికల్లో అజ్జుపై మూడు ఓట్ల మెజారిటీతో యాదయ్య గెలుపొందారు. ఉపాధ్యక్షుడి కోసం చంద్రమౌళి, నరేందర్ పోటీచేయగా నరేందర్‌కు ఏడు ఓట్ల మెజారిటీ వచ్చింది. గెలుపొందినవారికి ఎన్నికల అధికారులు సుధాకర్, మన్సూర్‌ఖాన్‌లు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. అనంతరం పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరులో పునఃనిర్మిస్తున్న శివాలయానికి భారత రాష్ట్ర సమితి నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ రూ.1,00116 ల విరాళంగా కమిటీ అధ్యక్షుడు కుమారస్వామికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, భీంరెడ్డి, బాలస్వామి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమావేశం

కల్వకుర్తి: పట్టణంలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 18న విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఈ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

29న దళిత జర్నలిస్టుల ఆత్మగౌరవ సభ

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 29వ తేదీన ఉమ్మడి పాలమూరు జిల్లాలో నిర్వహించే దళిత జర్నలిస్టుల ఫోరం ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి వెంకటస్వామి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్న దళిత జర్నలిస్టులందరూ సభకు హాజరు కావాలని కోరారు. దళిత జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపైన ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పోస్టల్ సేవలపై అవగాహన

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్ద కార్పాములలో సోమవారం పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టాఫీసు సేవింగ్ ఖాతా, ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేయబడునని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ఎమ్మెల్సీ పరామర్శ

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన సతీష్ శనివారం ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి బాధిత కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్ రావు, బాలరాజు హాజరయ్యారు.



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న యాదగిరి గౌడ్



కల్వకుర్తిలో..



తెలకపల్లిలో..

డిమాండ్లు నెరవేర్చాలి

నాగర్‌కర్నూల్ రూరల్: వివిధ డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 11 వ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి గౌడ్ హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రాము, కుర్మయ్య, కాశీం, శాంతయ్య, వెంకట్‌రెడ్డి, నారాయణ, పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి పరశురాములు సంఘీభావం ప్రకటించారు. గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం అధ్యక్షులు సర్దార్, యూటీఎఫ్ నాయకులు చిన్నయ్య, సీఐటియూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, గిరిజన సంఘం అధ్యక్షుడు మహిపాల్ మద్దతు తెలిపారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం వద్ద పంచాయతీ కార్మికులు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఆలేరు ఎంపీటీసీ సభ్యుడు జింకల ఈశ్వరయ్య, గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, కుర్మయ్య, గొర్ల స్వామి, రఫీక్, ముత్యాలు, పాల్గొన్నారు.



వెల్దండలో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

తాడూరు: పంచాయతీ కార్మికులకు కేవీపీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రామస్వామి, బాలస్వామి, రాములు పాల్గొన్నారు.

బిజినేపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెడ్పీటీసీ తూము హరిచరణ్‌రెడ్డికి పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సురేష్, మల్లేష్, బత్తుల వేంకటేశ్వర్లు, దస్తగిరి, కుర్మయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఆదివారం భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో మురళీ, లక్ష్మీనారాయణ, బొజ్జయ్య, ఆయా గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్



ఇళ్లమధ్యన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

అమ్రాబాద్: మండలంలోని కుమ్మరోనిపల్లిలో ఇళ్ల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ లైన్ కూడా రోడ్డుకు అడ్డంగా వేలాడుతూ ఉన్నాయి. దీంతో పత్తి, మిరప లోడులతో వెళ్లే పెద్ద వాహనాలకు తగిలి పలుమార్లు వైర్లు తెగిపడిన సంఘటనలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లను ఇతర ప్రదేశంలో ఏర్పాటు చేయాలని గ్రామస్తులు రాస్తారోకో చేపట్టినా విద్యుత్ అధికారుల్లో ఏ మాత్ర చలనం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అరుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు



లింగాల: మండలంలోని అంబట్‌పల్లి-యాపట్ల మార్గంలో ఆదివారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న అరుగురిని గుర్తించారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రోడ్డు నియమ నిబంధనలు తప్పక పాటించాలని కోరారు.

పాత పింఛన్ అమలుచేయాలి

కొల్లాపూర్: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల జీవనాధారం కోసం పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు బృంగి కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దుచేసి, ఓపీఎస్‌ను అమలుచేయాలన్నారు. అలంపూర్ నుంచి ప్రారంభమైన సంకల్ప రథయాత్ర సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో వీరం అమరేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహరావు, శ్రీనివాసులు, వరప్రసాద్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న బృంగి కృష్ణప్రసాద్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



అచ్చంపేట రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం మున్సిపాలిటీలోని 20 వార్డులలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో హత్ సే హత్ జోడో యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కుల రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, కపిలవాయి చంద్రమోహన్, గిరివర్ధన్‌గౌడ్, మల్లికార్జున్, యుగంధర్‌గౌడ్, సుశీల, శేఖర్, వెంకటరమణ పాల్గొన్నారు.

కుమారుడిని ఆదరించండి



బిజినేపల్లి: ప్రజా సేవ చేసేందుకు కుమారుడు రాజేష్‌రెడ్డిని ఆదరించాలని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ కందనూలు ఎలాంటి మచ్చ లేకుండా ప్రజల కోసమే పని చేశానని పేర్కొన్నారు. తనలాగే రాజేష్‌రెడ్డి ప్రజా సేవ చేసేందుకు ముందుకొచ్చాడని అందరు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకటస్వామి, తిరుపతయ్య, ఏద్దుల రాములు, పరుశరాములు, తిరుపతయ్య, మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కొల్లాపూర్: ఈనెల 18న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ సభకు హాజరుకావాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి ఆయన నివాసంలో ఆ సంఘం నాయకులు ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. విశ్వబ్రాహ్మణుల హక్కుల పరిరక్షణ, రాజకీయ ప్రాధాన్యం అంశాలపై చర్చ ఉంటుందని వివరించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రఘుప్రోలు చంద్రశేఖరాచారి, రవిచారి, యాదగిరిచారి తదితరులున్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని దేశిటిక్యాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి జి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలో సర్వే నిర్వహించారు. డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, బీసీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లింగం, శివకేశవులు, రాము, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కేంద్రానికి సంకల్ప రథ యాత్ర

కందనూలు: టీఎస్ సీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో చేపట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథ యాత్ర సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరి పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరం అమరేందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కల్వకుర్తిలో టిఫిన్ చేస్తున్న ఆచారి

కల్వకుర్తిరూరల్: రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ నాయకుడు ఆచారి కోరారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సామూహిక టిఫిన్ బాక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిఫిన్ పే చర్చలో భాగంగా కార్యకర్తలు ఇంటి నుంచి అల్పాహారం తెచ్చుకుని సహపంక్తి టిఫిన్ చేశారు. అనంతరం పట్టణంలోని పలువురు ప్రముఖుల ఇంటికి వెళ్లి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. తొమ్మిది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వ చేసిన అభివృద్ధిని వివరించి ముద్రించిన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో రాఘవేందర్‌గౌడ్, దుర్గా ప్రసాద్, శేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బాలీదేవ్ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని ఎంగంపల్లి తండాలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. రామన్న ఎన్నికల్లో ఏల్లేని సుధాకర్ రావును ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రసాద్, ఖలీల్, మూలె వెంకటేష్, శ్రీహరిశర్మ, ఎల్లస్వామి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కందనూలు: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో టిఫిన్ బాక్స్ ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు ఇంటి నుంచి టిఫిన్ బాక్స్, వాటర్ బాటిళ్లతో హాజరయ్యారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్ కింద తిని, పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీప్,నాయకులు సుధాకర్‌రెడ్డి, చందు, రాము, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణ గౌడ్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల, నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టులకు పింఛన్ ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: సీనియర్ జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కాలూరి శ్రీను ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాజం కోసం, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు తమ జీవితాలను త్యాగం చేస్తారని తెలిపారు. దేశంలో ఐదు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పిస్తున్నారని గుర్తు చేశారు. 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్యాంటీన్ నిర్వాహకులతో వాగ్వాదం

కల్వకుర్తి టౌన్: సినిమా టికెట్ల అధిక ధరలతో సామాన్య ప్రజలు సతమతమవుతుంటే కాంటీన్‌లో విక్రయించే తినుబండారాలను అధిక ధరలు విక్రయించడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. థియేటర్ యాజమాన్యం, కాంటీన్ నిర్వాహకుల తీరుపై ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో ఉన్న ఓ థియేటర్‌లో కూల్‌డ్రింక్, నీళ్లబాటిళ్లను రెట్టింపు ధరలకు విక్రయించడంతో ప్రేక్షకులు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఇదే విషయమై మేనేజర్‌ను ప్రశ్నిస్తే మీకు ఇష్టం ఉన్న చోట ఫిర్యాదు చేసుకోవాలని, మా ఇష్టం వచ్చినట్లుగా అమ్మకాలు కొనసాగిస్తామనడంతో అవాక్కయ్యారు. సంబంధిత అధికారుల పట్టించుకోకపోవడంతోనే ఇష్టానుసారంగా తినుబండారాలు విక్రయిస్తున్నారని ప్రేక్షకులు ఆరోపించారు. అధికారులు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే దళితులకు న్యాయం

సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ హయాంలో దళితులకు ఉచితంగా కరెంట్ ఇస్తే.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యుత్ బిల్లులు, ట్యాక్స్‌లతో పేదలను దోచుకుంటోందని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలోని ఎస్సీ కుటుంబాల ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు బిల్లులు కట్టని పేదలపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి సర్‌చార్జీలు, ఎరియర్స్, పెనాల్టీ పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డగోలుగా వసూళ్లు చేస్తోందని విమర్శించారు. వినియోగించిన విద్యుత్ చార్జీల కంటే ఇతర రుసుములే అధికంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే వాటిపై ప్రాపర్టీ టాక్స్ వసూలు చేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని సబ్ స్టేషన్లు కాంగ్రెస్ హయాంలోనే ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్న సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అదేవిధంగా ఎస్సీకాలనీలోని ఈదమ్మకు చెందిన గుడిసెను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్థం రవి, కోటయ్య, లక్ష్మయ్య, నిజాం, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో అంబేడ్కర్‌కాలనీలో గుడిసెను పరిశీలిస్తున్న నాగం జనార్దన్‌రెడ్డి

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

బల్మూర్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి శ్రావణి(945)ని ఆయన సన్మానించారు. అదేవిధంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేనేపల్లి అరుణ, పీఏసీఎస్ చైర్మన్ నర్సయ్యయాదవ్, సర్పంచ్ శివశంకర్, ప్రత్యేకాధికారి లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

బహుజన రాజ్యాధికారం సాధిద్దాం



కరపత్రాలు విడుదల చేస్తున్న గర్దం విజయ్

తెలకపల్లి: పోరాటంతోనే బహుజనుల రాజ్యాధికారం సాధించవచ్చని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గర్దం విజయ్ అన్నారు. బీఎంపీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ప్రారంభమైన బహుజన తిరుగుబాటు యాత్ర ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. రైతులకు విత్తనాలు, యూరియా, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్ట పరిహారాలు ఇవ్వాలన్నారు. రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. రైతు బంధు ద్వారా 20 లక్షల మంది పేద రైతులకు రూ.650 కోట్ల చెల్లిస్తే భూస్వాములకు లక్ష మందికి రూ.670 కోట్లు ఇస్తున్నారన్నారు. ప్రజాధనాన్ని మొత్తం భూస్వాములకే ఖర్చు చేస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎంపీ కళాబృందం జిల్లా ఇన్‌చార్జ్ నరిగె నరేందర్, బహుజన క్రాంతి మోర్చా జిల్లా ఇన్‌చార్జ్ చంద్రస్వామి, మండల నాయకులు సాయికిరణ్, మహేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బయన్నస్వామికి జలాభిషేకం

పెంట్లవెల్లి: వానలు సమృద్ధిగా కురవాలని కోరుతూ ఆదివారం బయన్న స్వామికి భక్తులు జలాభిషేకం చేశారు. మండలంలోని గట్టుపై వెలిసిన బైయన్న స్వామికి గోపులాపూర్ గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. స్వామివారి ఎదుట బండపై పాయసం పోసి రైతులు ఆరగించారు. కార్యక్రమంలో వెంకటస్వామిరెడ్డి, భాస్కర్, కురుమయ్య, నరేష్, పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న గోపులాపూర్ రైతులు

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

బిజినేపల్లి: మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన సంగిశెట్టి సైదులు అదృశ్యమైన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రాములు యాదవ్ వివరాల ప్రకారం ఈ నెల ఆరో తేదీన సైదులు దంపతులు రాత్రి ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున లేచే సరికి భర్త కనిపించలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, వివిధ ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆదివారం సైదులు భార్య శశికళ పోలీసుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సైదులు(ఫైల్)

కంకర వేశారు.. బీటీ మరిచారు



మండలం కొట్ర-పోతేపల్లి రోడ్డులో కంకర తేలి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

వెల్దండ: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. బీటీ రోడ్లు లేక గ్రామీణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఉన్న రోడ్లపై కంకర తేలడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వృద్ధులు, చిన్నారులు నరకయాతన అనుభవిస్తున్నాయి. మండల కేంద్రానికి చేరుకోవాలంటే కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వర్షాకాలంలో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని ఆయా గ్రామాలకు బీటీరోడ్లు మంజూరు కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నా మోక్షం దక్కడం లేదు. వర్షాకాలంలో రోడ్లపై గుంతలు పడి నీరు నిలిచిపోవడంతో రాత్రివేళల్లో ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో పోతేపల్లి, కొట్ర, కలిమిరాళ్ల తండా, గొల్లోనిపల్లి, బైరాపూర్, చంద్రాయన్‌పల్లి గ్రామాలకు రోడ్లపై కంకర తేలడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.